నిధులున్నా.. నిర్మాణమెప్పుడో?

యూపీహెచ్‌సీల నిర్మాణాలకు స్థలాల కొరత
- జాగాల కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యం
- జూన్‌లోపు పనులు ప్రారంభించకపోతే మంజూరైన నిధులు వెనక్కి..



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద పాత బజార్ సెంటర్ కోసం స్థలాన్ని చదును చేస్తున్న పొక్లెయినర్

మహబూబాబాద్ : నిధులు విడుదల చేయక పనులు నిలిచిపోతున్నాయా అంటే అర్థం ఉంది.. కానీ నిధులు విడుదలై ఏడాదయినా పనులు ప్రారంభం కాలేదు. కేవలం స్థలాలు కేటాయించకపోవడంతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కేవలం మూడు నెలల గడువు మాత్రమే ఉండడంతో ఆ లోపు పనులు ప్రారంభించాలి. అలా కాకపోతే మంజూరైన నిధులు వెనక్కి పోతాయని అధికారులు అంటున్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఆ భవనాలు పూర్తవుతాయి.

రూ 2.46 కోట్లు మంజూరు..

మానుకోట మున్సిపాలిటీకి మరో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మంజూరైంది. పాత బజార్‌లోని సుందరయ్య నగర్ కాలనీలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్వహిస్తున్నారు. కానీ ఆ సెంటర్ అద్దె భవనంలో కొనసాగుతోంది. హెల్త్ సెంటర్ల నూతన భవనాల నిర్మాణాలకు రూ.2.46 కోట్ల నిధులు ఏడాది క్రితం మంజూరయ్యాయి. జీ ప్లస్ వన్‌గా పదిగుంటల భూమిలో నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రతి భవనంలో డాక్టర్ల కోసం రెండు గదులు, మందుల కోసం గది, ఇంజక్షన్ రూం, ల్యాబ్ కోసం ఒకటి, హెల్త్ అండ్ వెల్‌నెస్‌కు ఒకటి, రెండు కన్సల్టెషన్ రూంలు, స్టాఫ్ రూం, ఇమ్యూనైజేషన్ కోసం రూం ఏర్పాటు చేయాలి. అలాగే ఆయా కేంద్రాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయాలి.

పాత బజార్‌లో ఒకటి, కొత్త బజార్‌లో మరొకటి..

ప్రస్తుతం పాత బజార్‌లో ఒక సెంటర్ ఉండగా మరొకటి కొత్త బజార్‌లోని బాబునాయక్ తండా వెళ్లే మార్గంలో సబ్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేయాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేస్తే బాబునాయక్ తండా, సాంక్రియాతండాతో పాటు మంగళికాలనీ, పత్తిపాక రజాలిపేట గ్రామానికి అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. పాత జబార్‌లో వెల్బుల సత్యంనగర్ కాలనీలో ఏర్పాటు చేస్తే పలు కాలనీలకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు అంటున్నారు. కానీ రెవెన్యూ అధికారులు రామచంద్రాపురం కాలనీ సమీపంలో ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద పాత బజార్ సెంటర్ కోసం స్థలం కేటాయించినా అది అనుకూలంగా లేదని రెవెన్యూ అధికారులు వివరించారు.

నేటికి స్థలాల కేటాయింపు లేకనే..

హెల్త్ సెంటర్లకు స్థలాల కేటాయింపు జరగలేదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. దీంతో విడుదలైన నిధులు మున్సిపల్ ఖాతాలోనే ఏడాదిగా ఉన్నాయి. జూన్ వరకు మాత్రమే గడువు ఉంది. గడువు దాటితే ఆ నిధులు వెనక్కి వెళ్లనున్నాయి. స్థలాలు కేటాయించిన తర్వాత డీటీసీపీ అనుమతి, డిజైన్ ఇతరత్రా ప్రక్రియ పూర్తి చేసి టెండర్లు నిర్వహించాలని మున్సిపల్ అధికారులు అంటున్నారు.

ఒక సెంటర్‌కు స్థలం కేటాయించాం..

పాత బజార్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న సెంటర్‌కు డబుల్ బెడ్రూం ఇళ్ల దగ్గర స్థలం కేటాయించాం. కొత్త బజార్ సెంటర్‌కు రజాలిపేట శివారు నంద్యా తండా వద్ద స్థలం పరిశీలించాం. కాని అది అనుకూలంగా లేదని మున్సిపల్ అధికారులు అంటున్నారు. బాబునాయక్ తండా శివారు సబ్‌స్టేషన్ వద్ద వారు స్థలం కేటాయించాలంటున్నారు. కానీ ఆ ప్రాంతంలో ఉన్న భూమి కోర్టు కేసులో ఉంది. నంద్యా తండా వద్ద ఉన్న స్థలాన్ని వారం రోజుల్లో కేటాయిస్తాం.

- భగవాన్‌రెడ్డి, తహసీల్దార్

పారితోషికం విడుదల చేయాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుధాకరాచారి



మాట్లాడుతున్న సుధాకరాచారి

తొర్రూరు : ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యుమరేటర్లకు పారితోషికం విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారి కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎస్టీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకరాచారి మాట్లాడుతూ సర్వే ముగిసి ఐదు నెలలు కావొస్తున్నా పారితోషికం మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. ఈ నెల 31 వరకు పారితోషికం విడుదల చేయకుంటే సదరు మొత్తం వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. చిరు ఉద్యోగులు పారితోషికం ఇస్తారనే ఆశతో సర్వే విజయవంతం చేశారని, నిధులు కేటాయించినప్పటికీ విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్ గౌడ్, నాయకులు రవి, రాజు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ సమీపంలో అగ్నిప్రమాదం



మంటల్లో కాలిపోతున్న పైపులు

డోర్నకల్ : డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు అతి సమీపంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఆర్ఆర్ఐ క్యాబిన్ పక్కన ఉన్న పైపులకు నిప్పంటుకుని కాలిపోయాయి. పైపులకు నిప్పంటుకోగా పొగ, మంటలు చెలరేగడంతో స్థానిక రైల్వే సిబ్బంది, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా మంటలను ఆర్పివేశారు. అండర్‌గ్రౌండ్‌లో అమర్చే ఓఎఫ్‌సీల రక్షణ కోసం వినియోగించే హెచ్‌డీపీసీ పైపులను స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన భద్రపర్చగా పైపులకు నిప్పంటుకుని కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు 200 మీటర్ల పైపులు దగ్ధం కాగా సుమారు రూ.30వేల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిసింది.

‘విద్యారంగానికి పెద్దపీట వేయాలి’

మహబూబాబాద్ అర్బన్ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతానికి తగ్గకుండా నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ కోరారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యా రంగానికి సరిపోయే బడ్జెట్ కేటాయించకపోవడంతో తల్లిదండ్రులు ప్రైవేటు వైపునకు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.మంజుల, ఎం.ప్రవీణ్ కుమార్, ఎస్.శైలజ, ఆర్.సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రత్యేక పాలనలో’ పడకేసిన అభివృద్ధి

- సీపీఎం మండల కార్యదర్శి సైదులు



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న నాయకులు, స్థానికులు

నెల్లికుదురు : సర్పంచ్‌ల పదవికాలం ముగిసిన తర్వాత ఏర్పాటు చేసిన ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పడకేసిందని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పాత సొసైటీ ఆవరణంలో ఉన్న చేతిపంపు పనిచేయకపోవడంతో స్థానికులతో కలిసి ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు తాగు నీరందించే చేతిపంపు పనిచేయక ఏడాది కావొస్తున్న పట్టించుకునేవారు కరువయ్యారని విమర్శించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేయని చేతిపంపులకు తక్షణమే మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య ఏర్పకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తోట యాకయ్య, శ్రీను, సోని, అఫీజా, ఆస్మా, యశోద, సుభద్ర, నందిని, ఎల్లమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు
- 20న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలి

నెహ్రూసెంటర్ : జిల్లావ్యాప్తంగా ఇళ్లు నిర్మించుకుంటున్న ప్రతి లబ్ధిదారుడికి ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని, కార్మిక వెల్ఫేర్ బోర్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో కలెక్టర్ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 20వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగనున్న ధర్నా కార్యక్రమానికి కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు ప్రమాదబీమా రూ.పది లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, పెళ్లి, ప్రసూతి కానుక కింద రూ. లక్ష చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో కార్మికుల బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరికుంట్ల నాగన్న, బానోత్ శంకర్, గారె కోటేశ్వర్‌రావు, నాగన్న, సర్వర్, వెంకన్న, రాము, బిచ్యాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ రమేష్

గూడూరు : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి వ్యవసాయ శాఖ కార్యాలయం వరకు ఆదివారం ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.60 లక్షలతో నిధుల సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో జీపీ నిధులు సరిగా రాకపోవడంతో గ్రామంలో కొన్ని వీధుల్లో రోడ్డు పనులు నిలిచాయని, నేడు ఎంపీ బలరాంనాయక్ సహకారంతో ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, ఎండీ యాకూబ్‌పాషా, కన్నబోయిన వెంకన్న, పెసరి శివ, ఖదీర్, హెచ్.శివ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై పోరాటం



డోర్నకల్ : మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు



మహబూబాబాద్ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న బి.అజయ్ సారథిరెడ్డి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వర్‌రావు

డోర్నకల్ : రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని అమ్మపాలెం పరిధిలోని రాజుతండాలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో నాగేశ్వర్‌రావు మాట్లాడారు. ఈ నెల 18న బయ్యారంలో జరిగే సంఘ రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు లావుడ్యా రాంజీ, రమేష్, జన్ను స్వామి, వీరన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఏఐకేఎస్..

మహబూబాబాద్ రూరల్ : రైతాంగ సమస్యలపై ఏఐకేఎస్ పోరాటాలు నిర్వహిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేక వీరన్న, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి అన్నారు. రైతు సంఘం మండల మహాసభ మండలంలోని ముడుపుగల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా హాజరై వీరన్న, అజయ్ సారథిరెడ్డి మాట్లాడారు. ఈ నెల 18న (మంగళవారం) బయ్యారంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా మూడో మహాసభలకు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే విధానాలలో మార్పురాకపోగా కార్పొరేట్ విధానాలతో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్నారని విమర్శించారు. కట్లోజు పాండురంగాచారి, తండ సందీప్, పోలగాని శ్రీనివాస్, రేషపల్లి నవీన్, తండ సతీష్, బర్ల వీరన్న, గుణగంటి శేఖర్, పీక్య నాయక్, తండ రమేష్, వెంకటనారాయణ, మురళి, శ్రీనాథ్, మునెందర్, కొత్తకొండ రాములు, బండారి శ్రీను, తేజావత్ వినయ్, బానోత్ వెంక్య, మంగ్య, రైతులు పాల్గొన్నారు.

సన్మానం



మహబూబాబాద్ అర్బన్ : బీజేపీ జాతీయ నాయకుడు, కేంద్ర మాజీ హోంశాఖ సహాయ మంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌ను వరంగల్ పర్యటనలో ఆదివారం మానుకోట బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభూ వెంకటేశ్వర్లు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఒద్దిరాజు రామచంద్రరావు, మహేష్‌గౌడ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి జయరాజుకు..



మహబూబాబాద్ రూరల్ : మానుకోటకు చెందిన ప్రజాకవి గుర్రాల జయరాజును ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్, పట్టణ కాంగ్రెస్ ఓబీసీ అధ్యక్షుడు లింగాల వీరభద్రగౌడ్, పట్టణ ఎస్టీ సెల్ చైర్మన్ తేజావత్ శంకర్ నాయక్, ముంజాల రాజేంద్ర, కపూర్, యుగంధర్ రెడ్డి, నరేష్, దుర్గేష్ ఉన్నారు.

విద్యుత్‌తీగ యమపాశమై..!



సోమన్న (ఫైల్)

పెద్దవంగర : దుస్తులు ఆరేసిన దండెం తీగ ఓ యువకుడి పాలిట యమపాశమైంది. దుస్తులు ధరించేందుకు తీగపై ఉన్న వాటిని తీస్తున్న క్రమంలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శ్రీరాం సోమన్న (25) కులవృత్తి చేసుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. వృత్తి ముగించుకొని రాత్రి ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం కాళ్లు, చేతులు శుభ్రం చేసుకొని దుస్తులు మార్చుకునేందుకు ఇంటిఎదుట రేకుల కింద ఉన్న ఇనుప తీగతో అమర్చిన దండెంకు విద్యుత్ సరాఫరా అయిన విషయం గమనించలేదు. దండెంపై ఉన్న దుస్తులు తీస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు యాకాంబ్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. నలుగురికి తీవ్ర గాయాలు

దంతాలపల్లి : ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మన్నూరి సత్యనారాయణ–నాగమణి పని నిమిత్తం టీవీఎస్ వాహనంపై తొర్రూరుకు వెళ్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఏనుగంటి నరేష్, నెమ్మది ఉపేందర్‌లు తొర్రూరు నుంచి దంతాలపల్లికి బైక్‌పై వస్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న కారుని తప్పించబోయి ప్రమాదవశాత్తు రెండు బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో నరేష్, ఉపేందర్, సత్యనారాయణ, నాగమణికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రెండిళ్లలో చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా లాకర్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గల రెండిళ్లలో చోరీ చేసి రూ.75 వేలు, 1 గ్రాము బంగారు కాయిన్, 2 తులాల వెండి అపహరించుకు పోయారు. బాధితులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి క్లూస్ టీం బృందం, పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. కంబాలపల్లికి చెందిన గుర్రాల మల్లారెడ్డి తమ బంధువుల ఇంట్లో వివాహం ఉండగా కుటుంబ సభ్యులంతా అక్కడకు వెళ్లారు. ఎవరు లేని సమయంలో ఇంట్లో బీరువా పగులగొట్టి రూ.50 వేలు నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే దుబ్బ వెంకన్న కుమారుడు హైదరాబాదులో ఉండగా అతను అక్కడికి వెళ్లాడు. వారి ఇంట్లోని బీరువా పగులగొట్టి అందులోని 1 గ్రాము బంగారు కాయిన్, 2 తులాల వెండి ఆభరణాలు, రూ.25 వేల నగదు అపహరించుకుని పోయారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



అరిపిరాలలో పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు రూరల్ : మండలంలోని మడిపల్లి మాజీ సర్పంచ్ వెల్పుల ఐలయ్య కుటుంబాన్ని మాజీ మంత్రి, పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ ఐలయ్య తండ్రి వీరయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పాటి అంజయ్య, పానుగోటి సోమేశ్వర్‌రావు, కుర్ర శ్రీనివాస్‌గౌడ్, రాయిశెట్టి వెంకన్న, శీలం లింగన్నగౌడ్, సాయిలు, విద్యాసాగర్, రాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మండలంలోని అరిపిరాలకు చెందిన సుంచు రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని, రాములు కుమారుడు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతోష్‌ను ఆ పార్టీ నాయకుడు మాలోత్ రాజేందర్–సునీత దంపతులు పరామర్శించి, రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ మండల, గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కురవి : మండలంలోని బలపాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2009–10సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.పాఠశాల ఆవరణలో కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తరగతి గదుల్లో కలియ తిరిగారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంబురపడ్డారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



డోర్నకల్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పేద ముస్లింలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఎండీ బదర్‌పాషా జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు సుమారు 150 మంది ముస్లింలకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో ఎండీ సలీం, జంబు, గౌస్, సుల్తాన్, పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

‘అక్రమ అరెస్టులు సరికాదు’

పెద్దవంగర : అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ పర్యటన నేపథ్యంలో ఆదివారం మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, విడుదల చేశారు. ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బీజేపీ నాయకులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్, భాస్కర్, కుమార్, శంకర్ ఉన్నారు.

దాతలు ముందుకు రావాలి



మహబూబాబాద్ అర్బన్ : పేద రైతులను ఆర్థికంగా ఆదుకోవాడానికి దాతలు ముందుకు రావాలని భారత్ వికాస్ పరిషత్ రీజినల్ కార్యదర్శి వి.వి.నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్‌లో ఆదివారం రైతులకు పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 12 మంది రైతులకు పవర్ స్ప్రేయర్స్‌ను అందజేశామని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



తొర్రూరు : పద్మశాలి చేనేత సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోతె విక్రమ్, గౌరవ అధ్యక్షుడిగా రేగొండ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పెండెం వెంకన్న, కోశాధికారిగా మోతె శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. పద్మశాలిల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు విక్రమ్ తెలిపారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం : మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కేంద్రంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న ఏఐకేఎంఎస్ జాతీయ మూడో మహాసభల వాల్ పోస్టర్‌ను ఆదివారం మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ..ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలకు రైతులు, కూలీలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, మొగిలాన్, రాజయ్య, ప్రేమ్‌కుమార్, సుందర్, బలరాం, రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్ర తీర్థోత్సవం



మహబూబాబాద్ రూరల్ : అనంతాద్రి శ్రీజగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ట్రస్టీ నూకల రామచంద్రారెడ్డి, జ్యోతి దంపతులు, ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు పర్యవేక్షణలో ఆదివారం చక్ర తీర్థోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయిని ప్రభాకర్‌రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

స్వర్ణలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవం

మండలంలోని నడివాడలో దళితుల ఆరాధ్య దైవం శ్రీస్వర్ణలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో మందుల రఘు ,భారతి, బొడ్డుపల్లి ఉపేంద్రం, ఇనుగుర్తి సుధాకర్, మహమ్మద్ సుభాని, సలీమా, శంతన్ రామరాజు, రమేష్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

మహబూబాబాద్ : ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం మూడోరోజుకు చేరాయి. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.